నిధుల వినియోగంపై ఆడిట్ చేయించాలి

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కరుణాకర్

జనగామ, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ) : 2018-19 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-24 వరకు జనగామ పురపాలక సంఘం పరిధిలో వినియోగించిన సుమారు రూ.100 కోట్లకు సంబంధించి పూర్తిస్థాయి ఆడిట్ చేయించి, అవకతవకలకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) కోరింది. ఈ మేరకు కమిటీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి యాసారపు కరుణాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు ముక్క వెంకటయ్య బుధవారం జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలో ఆరేళ్లుగా ఆడిటింగ్ చేయడం లేదని ఆరోపించారు. కొందరు కౌన్సిలర్లు, అధికారులు కుమ్మక్కై మున్సిపల్ సమావేశాలల్లో రసాభాస చేసి నిధుల ఖర్చుపై ఆడిటింగ్ చేయకుండా అక్రమాల అంశాన్ని పక్కదారి పట్టిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఆడిటింగ్ చేయించి ప్రజాధనాన్ని కాపాడాలని వారు కోరారు.

నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించిన సీఐ

బచ్చన్నపేట, సెప్టెంబర్ 11 : గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా ప్రజలు పోలీసులకు సహకరించాలని నర్మెట సీఐ సాయిరమణ కోరారు. బుధవారం స్థానిక ఎస్సై సతీశ్‌తో కలిసి గుడి చెరువును ఆయన సందర్శించి ఏర్పాట్లపై చర్చించారు. సీఐ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. వినాయకుల నిమజ్జనం సందర్భంగా చెరువుల వద్ద బారీకేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. మద్యం సేవించిన వారు నిమజ్జనాలకు రావొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ఫణికిశోర్, ఎంపీడీవో మల్లికార్జున్ , ఆర్ఐ శ్రీనివాస్ రావు, మండల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, నాయకులు జంగిటి విద్యానాథ్, మాసపేట రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అనిల్‌రాజ్ పాల్గొన్నారు.

వెల్దండలో గణపతి మహా హోమం

గణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

నర్మెట/దేవరుప్పుల, సెప్టెంబర్ 11: గణేశ్ నవరాత్రోత్సవాల్లో భాగంగా మండలంలోని వెల్దండ శివాలయ ఆవరణలో యంగ్‌స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం గణపతి హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, మహాఅన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పూజారి ప్రణయ్, యూత్ సభ్యులు పిట్టల నరేశ్, ప్రేమ్‌కుమార్, రాజు, రవికుమార్, అరవింద్, దీపక్, భాస్కర్, పరమేశ్, బాలరాజు, కోటి, పవన్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా దేవరుప్పుల మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గణేశ్ యూత్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం నిర్వహించిన పూజల్లో అంగన్‌వాడీ కేంద్రం పిల్లలు వినాయకుడికి పూజలు చేశారు.

ఏకీకృత పెన్షన్‌తో ఉద్యోగులకు నష్టం

లింగాలఘనపురం,సెప్టెంబర్ 11: ఏకీకృత పెన్షన్‌తో ఉద్యోగులకు ఆర్థిక భద్రత ఉండదని టీపీటీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య అన్నారు. బుధవారం ఆ సంఘం ఆద్వర్యంలో మండలంలోని నెల్లుట్ల, కుందారం, చిటూరు, వనపర్తి, కేజీబీవీ పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని రెండు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో కేంద్రం కొత్తగా ఏకీకృత పెన్షన్ విధానం పేర మోసం చేస్తున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వై వజ్రయ్య, జిల్లా కౌన్సిలర్ కే మధు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ప్రభాకర్, కే. రాజయ్య, కార్యదర్శులు భాస్కర్, పరశురాములు, రాములు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సంఘం మండల కమిటీ

ఉత్పత్తిదారుల సంఘం నూతన కార్యవర్గం

జఫర్‌గఢ్, సెప్టెంబర్ 11 : విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పాల ఉత్పత్తిదారులు సమావేశం నిర్వహించారు. నూతన మండల అధ్యక్షుడిగా వడ్లకొండ స్వామి, ఉపాధ్యక్షుడిగా ముచ్చ సుధాకర్‌రెడ్డి, కార్యదర్శిగా కత్తుల రాజు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

మహిళా వర్సిటీకి వీరవనిత ఐలమ్మ పేరుపై హర్షం

పాలకుర్తి, సెప్టెంబర్11: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పేరును మహిళా విశ్వవిద్యాలయానికి నామకరణం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమనాథ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ, కవి డాక్టర్ శంకర్‌మంచి శ్యామ్‌ప్రసాద్, వీరమనేని వెంకటేశ్వర్‌రావుతో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఇదే స్ఫూర్తితో తెలుగు విశ్వవిద్యాలయానికి తెలంగాణ ఆది కవి, సామాజిక విప్లవ సాహితీవేత్త పాల్కురికి సోమనాథుడి పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

★సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-318996

PLOT FOR SALE

★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-326316

★Hyd. ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ మహేశ్వరం, ముచ్చర్ల, కందుకూరులో ప్లాట్లు, విల్లాలు, ఇండ్లు ఫర్ సేల్... మీ పిల్లల బంగారు భవిష్యత్తు... శ్రీశైలం హైవే. Cont: 8008091512.
NT-332647

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

కోతుల దాడిలో బాలికకు గాయాలు


గాయపడిన సాన్వి

దేవరుప్పుల, సెప్టెంబర్ 11: కోతుల దాడిలో బాలిక గాయపడిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫ్లైవుడ్ షాపు యజమాని మారోజు నరేశ్ కూతురు సాన్వి బుధవారం ఇంటి నుంచి బయటకు రాగా కోతులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. గమనించిన తల్లిందుడ్రులు సాన్వికి మెరుగైన వైద్యం కోసం జనగామ ఏరియా దవాఖానకు తరలించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కోతుల బెడదతో చిన్నారులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. కొంతకాలంగా గ్రామంలో వానరాల దాడులు పెరిగాయని వారు వివరించారు. గ్రామపంచాయతీతోపాటు అధికారులు పరిశీలించి కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

విషజ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- వైద్యులు , సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలి
- బచ్చన్నపేట సీహెచ్‌సీ తనిఖీలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

దవాఖానలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా

బచ్చన్నపేట, సెప్టెంబర్ 11 : సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, దవాఖానలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్(సీహెచ్‌సీ)ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో డాక్టర్లు, సిబ్బంది ఆశ్రద్ధ చేయకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రజలు ప్రభుత్వాసుపత్రికే వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో నీరు నిల్వ ఉండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని షేక్‌రిజ్వాన్‌బాషా సూచించారు. ఇంట్లో పాత వస్తువులు తొలగించాలన్నారు. జ్వరాలొస్తే పేషెంట్ల రక్త నమూనాలను సేకరించి వైద్య పరీక్షలకు పంపించాలన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు గ్రామ స్థాయి సిబ్బందికి మరింత అవగాహన కల్పించాలన్నారు. అనంతరం దవాఖానలో సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి రోగికి కేషీట్ తప్పని సరిగా నిర్వహించాలని డాక్టర్లకు సూచించారు. సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రక్త నమూనాలను జిల్లా కేంద్రంలోని దయాగ్నస్టిక్ సెంటర్‌కు పంపి రిపోర్టులు తెప్పించుకోవాలన్నారు. దవాఖాన ఆవరణ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు సృజన, ప్రసన్న కృష్ణ, మానస, కాంతిస్వరూప్, ఏఎన్ఎం, స్టాఫ్ నర్సులు ఐశ్వర్య, ప్రియదర్శిని, బొడ్డు శ్రీనివాస్, శ్వేత, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

వడ్లకొండ క్రాస్‌లో రోడ్డు పునరుద్ధరణ పనులు ప్రారంభం

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవతో స్పందించిన అధికారులు

వడ్లకొండ క్రాస్‌రోడ్డు వద్ద కొనసాగుతున్న పైపులైన్ పనులు

జనగామ రూరల్, సెప్టెంబర్ 11 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వడ్లకొండ-గానుగుపహాడ్ క్రాస్ రోడ్డు తెగిన నేపథ్యంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవతో పునరుద్ధరణ పనులు ప్రారంభయ్యాయి. భారీ వర్షాలతో తెగిన రోడ్డు పనులపై జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులకు బీఆర్ఎస్ ప్రతినిధులతో కలిసి ఇటీవల ఎమ్మెల్యే పల్లా వినతి పత్రం అందజేశారు. ఈ క్రమంలో అధికారులు బుధవారం తాత్కాలిక రోడ్డుపై కాంక్రీట్ వేసి పైపులతో మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో జనగామ-హుస్నాబాద్‌తో పాటు జనగామ మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు ప్రారంభం కానున్నాయి. ఎమ్మెల్యే కృషితో రోడ్డు పనులు ప్రారంభం కావడంతో పరిసర గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

గణపతి నవరాత్రి వేడుకల్లో అన్నదానం

రఘునాథపల్లి, సెప్టెంబర్ 6: వినాయకుడి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ఆదర్శ యూత్ బాధ్యులు అన్నదానం చేశారు. ఎస్సై నరేశ్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ బొల్లం అజయ్ మణికంఠ, మాజీ ఎంపీటీసీ పేర్ని ఉషా రవి దంపతులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, నాయకుడు గాదె మహేందర్‌రెడ్డి అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అన్నదాత పేర్ని పరశురాములు, యూత్ నాయకులు కొలుపుల పరశురాం, వీరస్వామి నర్సింహులు, నాగరాజు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధిపై సరికొత్తగా ఆలోచించాలి

జనగామ రూరల్, సెప్టెంబర్11 : ఉన్నత చదువులు చదివిన విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై సరికొత్తగా ఆలోచించాలని క్రీస్తుజ్యోతి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఫాదర్ విజయ్‌పాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని యశ్వంతాపూర్‌లోని కళాశాలలో సదస్సు నిర్వహించారు. విజయ్‌పాల్ రెడ్డి మాట్లాడుతూ సిపోర్ట్ ఏఐ కంపెనీ డైరెక్టర్ ఆర్ అరంజిత్ చౌదరి అన్‌లైన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారని తెలిపారు. సరికొత్త టెక్నాలజీని వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ చంద్రశేఖర్ రెడ్డి, ఐఐసీ కోఆర్డినేటర్ యాకూబ్, అనిత, ఉదయ్ పాల్గొన్నారు.

వంట గ్యాస్ లబ్ధిదారులకు 'మహాలక్ష్మి' పత్రాల పంపిణీ

వంట గ్యాస్ సమాచార పత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 11 : మహాలక్ష్మి పథకం అమల్లో భాగంగా రూ.500కే వంట గ్యాస్ సిలిండర్‌ను అందించేందుకు లబ్ధిదారులకు ప్రభుత్వ సమాచార పత్రాలను పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వంట గ్యాస్ లబ్ధిదారుల సమాచార పత్రాలను అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రజలపై ఆర్థిక భారం తగ్గించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రూ.500కే వంట గ్యాస్ సిలిండర్‌ను అందించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాలోని 76,430 మంది లబ్ధిదారులకు సంబంధించిన సమాచార పత్రాలు జిల్లాకు చేరుకున్నట్లు తెలిపారు. రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండలాలకు పత్రాలు చేరవేస్తామని ఆయన పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు, రేషన్ డీలర్ల ద్వారా లబ్ధిదారులకు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్‌వో సరస్వతి, ఏసీఎస్‌వో ఇర్ఫాన్ హైమద్ ఖాన్, డీటీసీఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాయుధ పోరాటాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 11 : భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని ఇప్పగూడెంలో సీపీఎం గ్రామ కార్యదర్శి గట్ల మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన శౌర్యయాత్ర, బహిరంగ సభలో ఆయనతోపాటు ముఖ్యఅతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ హాజరయ్యారు. నర్సిరెడ్డి మాట్లాడుతూ నాడు దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన మహత్తర సాయుధ పోరాటాన్ని బీజేపీ నేతలు వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. హిందువులు, ముస్లింలకు మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరిస్తున్నారని, దీన్ని ప్రజలు తిప్పి కొట్టాలని ఆయన కోరారు. అనంతరం పోరాట యోధుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీధి నాటకను ప్రజా నాట్యమండలి కళాకారులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, నాయకులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, మునిగెల రమేశ్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వేముల ఆనంద్, కట్ట నరసింహ, జిల్లా కమిటీ సభ్యులు కోడెపాక యాకయ్య, కుర్ర ఉప్పలయ్య, చిలుముల భాస్కర్, దైద రాములమ్మ, మంద మహేందర్, పోలాసు పరమేశ్, వంగపండ్ల సోమయ్య, పొగాకు యాదగిరి పాల్గొన్నారు.

సాయుధ పోరాటంపై కళాకారుల ప్రదర్శన

జఫర్‌గఢ్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఘట్టాలపై మండల కేంద్రంలో సీపీఎం నాయకులు, ప్రజానాట్యమండలి కళాకారులు బుధవారం ప్రదర్శన ఇచ్చారు. పాటలతోపాటు నాటి పోరాటాలను ప్రదర్శించి పెత్తందార్ల దౌర్జన్యాలను కళ్లకు కట్టినట్లు చూపారు. నిజాం రజాకార్లు ప్రజలను హింసకు గురి చేసిన అంశాలను ప్రదర్శించారు. కమ్యూనిస్టుల పోరాటంతోనే వేలాది ఎకరాలను పేదలకు పంచారని కళాకారులు వివరించారు.

సీపీఐ జిల్లా నాయకురాలు చల్లా శశిరేఖ మృతి

శశిరేఖ (ఫైల్)

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 11 : సీపీఐ అనుబంధ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చల్లా శశిరేఖ(68) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. మండలంలోని తాటికొండకు చెందిన శశిరేఖ సీపీఐ మండల ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ప్రజా సమస్యలపై పార్టీ తరపున నిర్వహించిన పోరాటాల్లో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో మృతదేహాన్ని పార్టీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కావటి యాదగిరి, యూనస్, జిల్లా కార్యవర్గ సభ్యులు సొప్పరి సోమయ్య, తోట రమేశ్, నాగరాజు, రహ్మాతుల్లా, జువారి రమేశ్, పైసా రాములు ఉన్నారు.

వైభవంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు

మండపాల వద్ద పూజలు

జఫర్‌గఢ్‌లో పూజలు చేస్తున్న భక్తులు

పాలకుర్తి, సెప్టెంబర్11: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంతో ఆయా గ్రామాల్లో ఉత్సవ కమిటీలు అన్నదానం చేశాయి. గణనాథులను భక్తులు దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద మహిళలు కోలాటలు నృత్యాలు కొనసాగించారు. మండల కేంద్రంలోని సోమేశ్వరస్వామి ఆలయం, గౌడ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వీరమనేని యాకాంతారావు, గంగు కృష్ణమూర్తి, నాయకులు ఎడవెల్లి పుష్పలత, సోంమల్లయ్య, వీరమనేని తిమ్మరావు, వీరమనేని వెంకటేశ్వర్‌రావు, కమ్మగాని నాగన్న, కమ్మగాని చుక్క సారయ్య, కమ్మగాని పర్శ రాములు, బండి కొండయ్య, కమ్మగాని శ్రీకాంత్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కమ్మగాని నరేశ్, కోశాధికారి తొట్టె సంపత్, సింగ మహేందర్‌రాజు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్ : మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక మండపాల వద్ద భక్తులు బుధవారం పూజలు నిర్వహించారు. గణపతిని దర్శించుకుని పులిహోర, ఇతర పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. పలు గ్రామాల్లోని వినాయక మండపాల వద్ద అన్నదానం చేశారు. సాగరం, జఫర్‌గఢ్, కూనూరు గ్రామాల్లో మండపాల వద్ద భక్తులు భజనలు చేస్తూ గణనాథులను కొలిచారు.

అంగన్‌వాడీ కేంద్రాలతో చిన్నారులకు పౌష్టికాహారం

ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి

బచ్చన్నపేట, సెప్టెంబర్ 11 : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నట్లు ఐసీడీఎస్ జనగామ సీడీపీవో రమాదేవి అన్నారు. బుధవారం మండలంలోని ఆలింపూర్, పడమటికేశ్వాపూర్‌లో పోషణ మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యార్థులకు ముద్రణ అవగాహన, పరిచయం, దాని భావన, పేజీలను తిప్పడం, చిత్రాల సహాయంతో కథలను చదివించేలా కృషి చేస్తున్నామని అన్నారు. ప్రతి కేంద్రంలో పిల్లల హాజరుశాతం పెంచాలన్నారు. కిచెన్‌గార్డెన్‌లు ఏర్పాటు చేసి ఆకు కూరలు, కూరగాయలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మనోహర, కవిత, హెల్త్ సూపర్‌వైజర్ రామానుజాచారి, ఏఎన్ఎంలు రజిత, మమత, సంపూర్ణ, స్వాతి, జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, వినోద, విజయ, విజయలక్ష్మి, ప్రేమలత, ఆశ వర్కర్లు స్వప్న, ప్రమీల పాల్గొన్నారు.

పోషణలోపం లేకుండా చూడాలి

నర్మెట : మండలంలోని హన్మంతాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మహోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్ పిల్లలతో కథల పుస్తకాల ద్వారా పిల్లలను మాట్లాడించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు పోషణ లోపం లేకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మమత, సంధ్యారాణి పాల్గొన్నారు.

విరాళం అందిస్తున్న భక్తుడు

సోమేశ్వరాలయానికి రూ.లక్షా 116 విరాళం

పాలకుర్తి, సెప్టెంబర్11: మండల కేంద్రంలోని సోమేశ్వరలక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో నిర్వహించనున్న అన్నదాన పథకానికి ఓ భక్తుడు రూ.లక్షా166 విరాళంగా అందించారు. దీనికి సంబంధించిన వివరాలను బుధవారం ఆలయ ఈవో మోహన్‌బాబు తెలిపారు.ఎన్ఆర్ఐ రావుల అరవింద్-శ్వేత దంపతులు ఆలయంలో త్వరలో నిర్వహించే అన్నదాన పథకానికి విరాళం అందించినట్లు తెలిపారు. అన్నదానానికి దాతలు మరింత మంది ముందుకు రావాలని ఈవో మోహన్‌బాబు కోరారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు డీవీఆర్‌శర్మ పాల్గొన్నారు.

సజావుగా గణపతుల నిమజ్జనం చేయాలి : డీసీపీ

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 11 : మండలంలో నిర్వహించే గణేశ్ నిమిజ్జనంలో అవాంతరాలు లేకుండా, సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని డీసీపీ రాజమహేంద్రనాయక్ సూచించారు. బుధవారం స్టేషన్ ఘన్‌పూర్ శివారు పుట్టలమ్మ కుంట చెరువులో వినాయకుడి నిమజ్జనానికి జరుగుతున్న ఏర్పాట్లను ఏసీపీ భీంశర్మ, సీఐ వేణుతో కలిసి ఆయన పరిశీలించారు. వినాయకుడి నిమజ్జనం జరిగే ప్రాంతంలో విద్యుత్ లైట్లు, గజ ఈతగాళ్లను, క్రేన్లను ఏర్పాటు చేయాలని కోరారు. బందోబస్తుకు తగినంత మంది పోలీసులను సమకూర్చుకోవాలని ఆయన సూచించారు.

హరీశ్‌రావును కలిసిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య

మాజీ మంత్రి హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న రాజయ్య

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 11 : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీరావును స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బుధవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నట్లు రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎప్పుడైనా ఉప ఎన్నికలు రావొచ్చని, అందుకు సిద్ధంగా ఉండాలని సూచించారని ఆయన పేర్కొన్నారు.

13న లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

బచ్చన్నపేట, సెప్టెంబర్ 11 : కల్యాణలక్ష్మి పథకంలో మండలంలోని లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఈ నెల 13న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. దీనికి సంబంధించిన వివరాలను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 107 మంది లబ్ధిదారులకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో చెక్కులు అందిస్తారని పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల నివారణ

వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు

లింగాలఘనపురం సెప్టెంబర్ 11: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారులు రవితేజ, సుస్మిత అన్నారు. మండలంలోని నవాబుపేటలో బుధవారం వైద్య శిబిరం నిర్వ